ముంచెత్తిన వాన

• జలమయమైన లోతట్టు ప్రాంతాలు, రోడ్లు • స్తంభించిన ట్రాఫిక్‌ • ఇబ్బందులు పడిన వాహనదారులు



టోలిచౌకీ చౌరస్తాలోని హోటల్‌, షాపుల్లోకి చేరిన వరద నీరు

గోల్కొండ: మెహిదీపట్నం, సరోజినీ ఆసుపత్రి, టోలిచౌకీ చౌరస్తా తదితర ప్రాంతాల్లో మంగళవారం ఉదయం భారీ వర్షం కురిసింది. టోలిచౌకి చౌరస్తా, హకీంపేట్‌, టూంబ్స్‌ రోడ్డు తదితర ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. టోలిచౌకీ చౌరస్తా పరిసరాల్లోని రుమాన్‌ హోటల్‌, రహమత్‌ హోటల్‌తో పాటు లిమ్రా షాదీఖానాలో భారీగా నీరు చేరింది. దీంతో మంగళవారం టోలిచౌకీ చౌరస్తా పరిసరాల్లోని హోటల్స్‌, షాపులు ఒకటి కూడా తెరుచుకోలేదు. షాదీఖానాల్లో డిస్కౌంట్‌ సెల్‌ కోసం పెట్టిన రెడిమేడ్‌ దుస్తులన్నీ నీట మునిగిపోయాయి. అదే విధంగా హోటల్స్‌లో మంగళవారం కోసం సిద్ధం చేసిన తినుబండారాలన్నీ నీటిలో కొట్టుకుపోయాయి.

డబీర్‌పురాలో..

చార్మినార్‌: పాతబస్తీలో మంగళవారం కురిసిన భారీ వర్షానికి డబీర్‌పురాలో రోడ్లన్నీ చెరువులను తలపించాయి. డబీర్‌పురా దర్వాజ నుంచి డబీర్‌పురా ఫ్లై ఓవర్‌ రోడ్డులో వరదనీరు రోడ్డుపై నలిచిపోవడంతో అటువైపు నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. గంటల తరబడి వాహనదారులు పలు ఇబ్బందులకు గురయ్యారు.

భారీ వర్షాలకు ఇళ్లల్లోకి నీరు..

అబిడ్స్‌: నిరంతరం కురుస్తున్న భారీ వర్షంతో కిషన్‌గంజ్‌ నాలా పొంగి ఇళ్లల్లోకి నీరు ప్రవేశించింది. కిషన్‌గంజ్‌, ఉస్మాన్‌గంజ్‌ పరిసర ప్రాంతాల్లో స్థానిక ప్రజలతో పాటు వ్యాపారస్తులు వర్షపు నీటితో తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. మంగళవారం కురిసిన భారీ వర్షాలు స్థానిక ప్రజలను అవస్థలపాలు చేశాయి. నాలా పొంగి ఇళ్లల్లోకి నీరు వచ్చినా జీహెచ్‌ఎంసీ సిబ్బంది ఏ మాత్రం పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

హైవేను ముంచెత్తిన వరద..

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో దాదాపు ఏడు సెంటి మీటర్ల వర్షపాతం నమోదయ్యింది. రోడ్లపై భారీగా వర్షపు నీరు నిలిచిపోవడంతో జీహెచ్‌ఎంసీ డీఆర్‌ఎఫ్‌ బృందాలు సాఫీగా నీరు వెళ్లేందుకు చర్యలు చేపట్టారు. బండ్లగూడలోని గౌస్‌ నగర్‌, ఇస్మాయిల్‌ నగర్‌, నూరీనగర్‌ల నుంచి వచ్చిన వరద నీరు దిగువన ఉన్న సూరం చెరువులోకి వెళ్లకుండా అక్రమ నిర్మాణాలు చేపట్టడం, ఆపై నూతనంగా నిర్మించిన ట్రంక్‌ లైన్‌ పనులు కూడా పెండింగ్‌లో ఉండడంతో వరద మొత్తం రోడెక్కింది. బండ్లగూడ చౌరస్తా వద్ద పెద్ద ఎత్తున పారడంతో బెంగళూర్‌ హైవేపై వెళుతున్న వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. చాంద్రాయణగుట్ట ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ శ్రీను నాయక్‌ ఆధ్వర్యంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



వరదతో ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

మాన్గార్‌బస్తీలో..

నాంపల్లి: సాయంత్రం కురిసిన కుండపోత వర్షానికి బస్తీలన్నీ జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లోని ఇండ్లలోనికి నీళ్లు వచ్చి చేరాయి. సెల్లార్లలోకి చేరిన వర్షపు నీటిని మోటార్లతో తోడి పోశారు. నాలాలన్నీ ఆక్రమణలకు గురికావడం, డ్రైనేజీ వ్యవస్థ పాడైపోవడంతో సాఫీగా వర్షపునీరు పోయే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో రోడ్లన్నీ నీటి మడుగులను తలపించాయి. వర్షపు నీటిని అదుపు చేయడంలో జీహెచ్‌ఎంసీ అధికారులు పూర్తిగా వైఫల్యం చెందారు. మాన్గార్‌బస్తీ, అఫ్జల్‌సాగర్‌, ఇందిరానగర్‌, ఆందాలమ్మ బస్తీ, టిప్పుఖాన్‌ సరాయి, వల్లభదాస్‌బాడా, ఫిరోజ్‌ గాంధీ నగర్‌లోనికి వర్షపు నీరు వచ్చి చేరింది.

భారీ వర్షాలకు నష్టపోయిన వారిని ఆదుకుంటాం

గోల్కొండ: భారీ వర్షాలకు నష్టపోయిన వారిని తప్పకుండా ఆదుకుంటామని ఎమ్మెల్యే కౌసర్‌ మోహియుద్దీన్‌ అన్నారు. మంగళవారం ఉదయం 5 నుంచి 8 గంటల వరకు ఆయన తన జీపులో కార్వాన్‌ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ముందుగా నీట మునిగిన టోలిచౌకి చౌరస్తాను తన జీపు నుంచే పరిశీలించారు. అనంతరం ఆయన హకీంపేట్‌ బుల్కాపూర్‌ నాలా పూర్తిగా వర్షం నీటితో నిండిన శాతం చెరువు, నయాకీలా కందకాలను పరిశీలించారు. అదే విధంగా వర్షం పడ్డప్పుడల్లా తమ షాపులు, హోటల్స్‌లో భారీగా వర్షం నీరు చేరుతుందని దీనికి శాశ్వత పరిష్కారం చూపించాలని పలువురు వ్యాపారులు ఆయనను కోరారు. వర్షాకాలం పూర్తయ్యేలోపు సమస్య పరిష్కారం అవుతుందని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.



కార్వాన్‌లో జీపులో పర్యటించి వర్షం వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కౌసర్‌

ఎట్టకేలకు రోడ్లపై మాన్‌సూన్‌ స్పెషల్‌ టీమ్‌లు



రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిని తొలగిస్తున్న మాన్‌సూన్‌ టీమ్‌

గోల్కొండ: ఇన్నాళ్లుగా వర్షాలు పడితే తమకేమి అన్నట్లు వ్యవహరించిన మాన్‌సూన్‌ టీమ్‌ వారు ఎట్టకేలకు రంగంలోకి దిగారు. రెండు రోజులుగా మాన్‌సూన్‌ స్పెషల్‌ టీమ్‌లు రోడ్లపై నిలిచి ఉన్న వర్షపు నీటిని తొలగిస్తు వస్తున్నారు. దీంతో ఓహో ఈ టీమ్‌లు ఇంకా పని చేస్తున్నాయా అంటూ పలువురు వ్యంగ్యంగా కామెంట్‌ చేస్తున్నారు. రెండు రోజుల క్రితం గోల్కొండ, నానల్‌నగర్‌లలో పర్యటించిన ఎమ్మెల్యే మాన్‌సూన్‌ టీమ్‌లు ఎక్కడ అని జలమండలి, బల్దియా అధికారులను ప్రశ్నించారు. దీంతో మాన్‌సూన్‌ స్పెషల్‌ స్క్వాడ్‌లు టోలిచౌకి, గోల్కొండ, హకీంపేట్‌ తదితర ప్రాంతాల్లో డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌ను శుభ్రం చేస్తూ కనపడ్డారు.



సెవన్‌ టూంబ్స్‌ రోడ్డులో..



డబీర్‌పురాలో చెరువును తలపిస్తున్న ప్రధాన రోడ్డు



కిషన్‌గంజ్‌ నాలా వద్ద..



బండ్లగూడలో..

బైండ్ల కులస్తులు హక్కుల సాధనకు కలిసికట్టుగా పోరాడాలి



కడియం శ్రీహరితో శివశంకర్‌

గోల్కొండ: బైండ్ల కులస్తులు తమ హక్కుల సాధన కోసం కలిసికట్టుగా పోరాడాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారి వృత్తిపని వారి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన శివశంకర్‌ మంగళవారం ఆయనను కలిశారు. శివశంకర్‌ మాట్లాడుతూ.. జగదాంబిక అమ్మవార్ల కుల వృత్తుల వారి సంఘం కృషి వల్ల నేడు కుల వృత్తుల వారికి గౌరవంతో పాటు రాష్ట్ర దేవాదాయ శాఖ వారి గుర్తింపు కూడా లభించిందన్నారు. సంఘం అధ్యక్షుడిగా సాయి బాబాచారి 14 ఏళ్ల పాటు కులవృత్తుల వారి సంక్షేమం కోసం పోరాటం చేశారన్నారు. ఆయన వెంట కుల వృత్తుల వారు ఆర్‌.నర్సింగ్‌రావు, శంకర్‌, అశోక్‌, నవీన్‌ తదితరులున్నారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి

అబిడ్స్‌: చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన అబిడ్స్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని తాజ్‌మహల్‌ హోటల్‌ వద్ద చోటు చేసుకుంది. ఈ నెల 17న రాత్రి బిహార్‌కు చెందిన మహ్మద్‌ ఖాసీం తాజ్‌మహల్‌ హోటల్‌ సమీపంలోని రోడ్డు పక్కన నిద్రిస్తున్నాడు. అదే సమయంలో అబిడ్స్‌ నుంచి వెళ్తున్న వాటర్‌ ట్యాంకర్‌ అతని కాళ్లమీదుగా పోయింది. పోలీస్‌ డ్యూటీలో ఉన్న బ్లూకోర్స్‌ సిబ్బంది పి.విశాల్‌ అతడిని గమనించి వెంటనే చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. 18న సీసీ కెమెరాల ద్వారా అబిడ్స్‌ పోలీసులు అతని కాళ్లపై వెళ్లిన వాటర్‌ ట్యాంకర్‌ను గుర్తించారు. ఘట్కేసర్‌కు చెందిన వాటర్‌ ట్యాంకర్‌ డ్రైవర్‌ మోకీన్‌ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఘనంగా శ్రావణ పూర్ణిమ వేడుకలు



పూజల్లో బీఆర్‌ఎస్‌ నాయకుడు ఆనంద్‌కుమార్‌ గౌడ్‌ తదితరులు

అఫ్జల్‌గంజ్‌: శ్రీహరీష్‌ చంద్రేశ్వర్‌ మహాదేవ్‌ ఆలయంలో శ్రావణ పూర్ణిమ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గోషామహల్‌ నియోజకవర్గ బీఆర్‌ఎస్‌ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్‌ గౌడ్‌ ముఖ్యఅతిథిగా హాజరై పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వందేళ్ల చరిత్ర కలిగిన మహాదేవ్‌ ఆలయం ఎంతో చరిత్రగాంచిందన్నారు. ఈ వేడుకల్లో బీజేపీ నాయకులు జితేందర్‌ తివారి తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌ క్షమాపణలు చెప్పాలి



మాట్లాడుతున్న అనిల్‌కుమార్‌

గన్‌ఫౌండ్రీ: రాజీవ్‌గాంధీపై బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌ చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ యువజన కాంగ్రెస్‌ రాష్ట్ర అధికార ప్రతినిధి కె.అనిల్‌కుమార్‌ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..రాజీవ్‌గాంధీపై మాట్లాడిన మాటలకు తక్షణమే క్షమాపణలు చెప్పాలని డిమాండ్‌ చేశారు. ఈ సమావేశంలో యూత్‌ కాంగ్రెస్‌ నాయకులు సి.మనోజ్‌కుమార్‌ యాదవ్‌, బోడ రాంచందర్‌, పునీత్‌కుమార్‌, మాజీద్‌భాయ్‌, శ్రీకాంత్‌, కమల్‌ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బ్రహ్మోత్సవాలు



విజయనగర్‌కాలనీ: ఆసిఫ్‌నగర్‌ దాయిబాగ్‌లోని హనుమాన్‌ బాలాజీ మందిరంలో 16వ వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. మంగళవారం విష్ణు సహస్రనామ పారాయణం, విశ్వక్షేణ పూజ, పుణ్యాహవాచం, రక్షాబంధనం, రుత్విక్‌వరణం, మృత్యంగ్రహణం, అంకురార్పణం, వాయినతేయ ధ్వజఘాయిదివాసము తదితర పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల్లోని భక్తులు బ్రహ్మోత్సవ పూజల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గృహ హింసను మహిళలు ఎదిరించాలి



మహిళలతో మాట్లాడుతున్న మహ్మద్‌ నజీబ్‌

గోల్కొండ: గృహ హింసను మహిళలు ఎదిరించాలని పీస్‌ ఫోర్స్‌ సొసైటీ నగర అధ్యక్షుడు మహ్మద్‌ నజీబ్‌ అన్నారు. షేక్‌పేట్‌కు చెందిన పలువురు మహిళలు టోలిచౌకీలోని సొసైటీ కార్యాలయంలో మహ్మద్‌ నజీబ్‌ను కలిశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు తమ పట్ల జరుగుతున్న గృహ హింసపై ఆయనకు ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యులే తమను నానా విధాలుగా వేధిస్తున్నారని పిల్లల బాగు కోరి తాము దౌర్జన్యాలను భరిస్తున్నామన్నారు. గృహహింసపై మన చట్టాలు పక్కాగా ఉన్నాయని మహిళలను హింసించే వారికి చట్టం ప్రకారం కఠినమైన శిక్షలు ఉన్నాయని అన్నారు. అయితే మహిళలు ధైర్యంగా కౌన్సెలింగ్‌ సెంటర్లకు వచ్చి హింసకు వ్యతిరేకంగా నోరువిప్పాలన్నారు.

కూచిపూడి నృత్య కళాకారులకు సన్మానం



చాంద్రాయణగుట్ట: స్వతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా భాషా సాంస్కృతిక శాఖ, మంజుల డాన్స్‌ అకాడమీల సంయుక్తాధ్వర్యంలో సోమవారం రాత్రి చిక్కడపల్లిలోని శ్రీ త్యాగరాయ గాన సభలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కూచిపూడి నృత్య ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉప్పుగూడ అశోక్‌నగర్‌కు చెందిన పార్వతి అక్షయ, గండి గీతిక శ్రీలను ముఖ్యఅతిథిగా హాజరైన సరస్వతి ఉపసకులు దైవాజ్ఞ శర్మ, డాన్స్‌ అకాడమీ నిర్వాహకురాలు మంజులతో కలిసి మెమెంటో, ప్రశంసాపత్రాలను అందజేసి సన్మానించారు.

అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేయాలి



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జాఫర్‌ హుస్సేన్‌

యాకుత్‌పురా: బస్తీల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేయాలని యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్‌ హుస్సేన్‌ మేరాజ్‌ అధికారులకు సూచించారు. యాకుత్‌పురా, రెయిన్‌బజార్‌, ఎస్‌ఆర్టీ కాలనీ, సూపర్‌ బజార్‌, బడాబజార్‌, ఈస్ట్‌ చంద్రానగర్‌ తదితర ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం ఆయన కార్పొరేటర్‌ మహ్మద్‌ వసీవుద్దీన్‌, పలు విభాగాల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వర్షా కాలంలో వరద నీటి సమస్యలు తలెత్తకుండా పలు ప్రాంతాల్లో నత్తనడకన కొనసాగుతున్న అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో మజ్లిస్‌ పార్టీ నాయకులు, జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులు పాల్గొన్నారు.

క్రీడారంగ అభివృద్ధికి అధిక ప్రాధాన్యం



క్రీడాకారులను అభినందిస్తున్న స్పోర్ట్స్‌ అథారిటీ చైర్మన్‌ శివసేనా రెడ్డి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడారంగ అభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తుందని స్పోర్ట్స్‌ అథారిటీ చైర్మన్‌ కె.శివసేనా రెడ్డి తెలిపారు. మంగళవారం ఎల్బీస్టేడియంలో 19వ ఐయిస్‌ స్కేటింగ్‌ జాతీయ చాంపియన్‌షిప్‌ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా శివసేనారెడ్డి మాట్లాడుతూ..జాతీయ స్థాయిలో తెలంగాణ రాష్ట్రం 2వ స్థానంలో నిలవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రోబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్ర క్రీడాకారులు అగ్రస్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఐయిస్‌ స్కేటింగ్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు దీపక్‌కుమార్‌, కోచ్‌లు మహ్మద్‌ అబ్దుల్‌ఖాదీర్‌ తదితరులు పాల్గొన్నారు.

యువతి పట్ల ర్యాపిడో డ్రైవర్‌ అసభ్య ప్రవర్తన

బంజారాహిల్స్‌: ఓ యువతి పట్ల ర్యాపిడో డ్రైవర్‌ అసభ్యంగా ప్రవర్తించిన ఘటన బంజారాహిల్స్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... బంజారాహిల్స్‌ రోడ్డునెంబర్‌-11లోని ఉదయ్‌ నగర్‌లో నివసించే ఓ యువతి (23) ఎర్రమంజిల్‌ పీవీఆర్‌ సినిమాస్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తుంది. విధులు ముగించుకున్న తరువాత ఇంటికి వెళ్లే క్రమంలో ర్యాపిడో బుక్‌ చేసుకుంది. ర్యాపిడో డ్రైవర్‌ రాకేష్‌ ఆమెను తీసుకుని వెళ్లే క్రమంలో ఆమెతో అసభ్యకరంగా ప్రవర్తించడమే కాకుండా అశ్లీల వీడియోలు చూపించే ప్రయత్నం చేశాడు. దీంతో ఇంటికి చేరగానే ఆమె చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేసింది. వారందరూ వచ్చేలోగా నిందితుడు రాకేష్‌ అక్కడి నుంచి పరారయ్యాడు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్‌ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సీఎంకు రాఖీ కట్టిన మమతా గుప్తా



అబిడ్స్‌: సీఎం రేవంత్‌రెడ్డికి మాజీ కార్పొరేటర్‌, గోషామహల్‌ నియోజకవర్గం కాంగ్రెస్‌ నాయకురాలు మంగళవారం మమతా గుప్తా రాఖీ కట్టారు. రక్షాబంధన్‌ వేడుకలను పురస్కరించుకొని ముఖ్యమంత్రి నివాసంలో ఆమె రేవంత్‌రెడ్డికి రాఖీ కట్టి రక్షాబంధన్‌ శుభాకాంక్షలు తెలిపారు.

ట్రాఫిక్‌ సమస్యలు తలెత్తకుండా చర్యలు



మోహన్‌ రావు

చాంద్రాయణగుట్ట: స్టేషన్‌ పరిధిలో ట్రాఫిక్‌ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని ఫలక్‌నుమా ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ ఎస్‌.మోహన్‌ రావు అన్నారు. ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయన మంగళవారం సాక్షితో మాట్లాడుతూ.. ఫలక్‌నుమా, ఇంజన్‌బౌలి, శంషీర్‌గంజ్‌, అలియాబాద్‌, లాల్‌దర్వాజా మోడ్‌, ఛత్రినాక చౌరస్తా, ఒవైసీ ఆసుపత్రి జంక్షన్‌లలో అవసరమైన మేరకు సిబ్బందిని అందుబాటులో ఉంచుతామన్నారు. ముఖ్యంగా వ్యాపార సముదాయాల వద్ద వాహనాల పార్కింగ్‌ రోడ్డుపై పెట్టకుండా నిర్వాహకులు చూసుకోవాలన్నారు. ట్రాఫిక్‌ నియమాలు ఉల్లంఘించిన వారికి ఛలానాలు విధిస్తామని తెలిపారు.

నియామకం



చంద్రకాంత్‌

జియాగూడ: తెలంగాణలో బీజేవైఎం పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని నూతనంగా బీజేపీ యువ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమితులైన గుడుమని చంద్రకాంత్‌ అన్నారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు మహేందర్‌ చేతుల మీదుగా గోల్కొండ జిల్లా నుంచి ఆయన నియామకపత్రాన్ని అందుకున్నారు. అనంతరం చంద్రకాంత్‌ మాట్లాడుతూ..పార్టీకి యువ మోర్చా విభాగం వెన్నుముక లాంటిదన్నారు. అనంతరం రాష్ట్ర బీజేవైఎం కోశాధికారి యోగిరాజ్‌ సింగ్‌, కార్వాన్‌ డివిజన్‌ అధ్యక్షుడు దొర్తుల శ్రీనివాస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

‘దేశంలో సాంకేతిక విప్లవ ఘనత రాజీవ్‌గాంధీదే’



గౌరి సతీష్‌

అబిడ్స్‌: దేశంలో సాంకేతిక విప్లవం తెచ్చిన ఘనత దివంగత మాజీ ప్రధాన మంత్రి రాజీవ్‌గాంధీదే అని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరి సతీష్‌ పేర్కొన్నారు. రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని తాము తొలగిస్తామంటూ మాజీ మంత్రి కేటీఆర్‌ పేర్కొనడం సిగ్గుచేటుగా ఉందన్నారు. ఇంకా 20 ఏళ్లు అయినా బీఆర్‌ఎస్‌ అధికారంలోకి రాదని కేటీఆర్‌ గ్రహించాలన్నారు. ప్రజలంతా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి అనుకూలంగా ఉంటూ సుఖః సంతోషాలతో జీవిస్తుంటే కేటీఆర్‌ తట్టుకోలేకపోతున్నారన్నారు. మతిభ్రమించే విధంగా కేటీఆర్‌ ప్రవర్తిస్తే తమ కాంగ్రెస్‌ శ్రేణులు తమ తడాక చూపుతారన్నారు. దేశంలో 18 ఏళ్లకే ఓటు హక్కును కల్పించిన ఘనత రాజీవ్‌గాంధీదే అన్న విషయం ఒక్కసారి కేటీఆర్‌ తెలుసుకోవాలని గౌరీ సతీష్‌ సూచించారు.

టీడీఎఫ్‌ సిల్వర్‌జూబ్లీ ఉత్సవాల లోగో ఆవిష్కరణ



లోగోను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కోదండరాం

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ ఉద్యమం కోసం కృషి చేసిన ఎన్‌ఆర్‌ఐలు నేడు రాష్ట్ర అభివృద్ధికి అండగా నిలవాలని శాసన మండలి సభ్యుడు ప్రొఫెసర్‌ కోదండరాం అన్నారు. తెలంగాణ డెవలప్‌మెంట్‌ ఫోరం సిల్వర్‌ జూబ్లీ వేడుకల వాల్‌పోస్టర్‌ను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా సహకరించాలని కోరారు. టీడీఎఫ్‌ వ్యవస్థాపక అధ్యక్షుడు డీపీ రెడ్డి మాట్లాడుతూ..తెలంగాణ ఉద్యమంలో టీడీఎఫ్‌ కీలక పాత్ర పోషించిందని గుర్తు చేశారు. టీడీఎఫ్‌ స్థాపించి 25 ఏళ్లు పూర్తి చేసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని సిల్వర్‌ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు తగు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా టీడీఎఫ్‌ సిల్వర్‌జూబ్లీ వేడుకల లోగోనే సీఎం రేవంత్‌రెడ్డితో సైతం ఆవిష్కరింపజేశారు. ఈ కార్యక్రమంలో టీడీఎఫ్‌ ప్రతినిధులు మణికొండ శ్రీనివాస్‌, ఎస్‌.భరత్‌, మట్టా రాజేశ్వర్‌ రెడ్డి, పోరెడ్డి శ్రవంత్‌, ఎం.శ్రీనాథ్‌, గున్న కీర్తి, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌ గాంధీకి ఘన నివాళి



పండ్లు పంచి పెడుతున్న నిరంజన్‌

చార్మినార్‌: రాజీవ్‌ గాంధీ సద్భావన యాత్ర స్మారక సమితి ఆధ్వర్యంలో దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌ గాంధీ 80వ జయంతిని చార్మినార్‌ వద్ద మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్మారక సమితి అధ్యక్షుడు, టీ పీసీసీ సీనియర్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ జీ.నిరంజన్‌ సద్భావన పోల్‌ వద్ద కాంగ్రెస్‌ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి రాజీవ్‌ గాంధీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాజీవ్‌ గాంధీతోనే టెక్నాలజీలో విప్లవం వచ్చిందని..తద్వారా భారత దేశం టెక్నాలజీలో ప్రపంచంలోనే ముందు వరసలో దూసుకెళ్తుందని కొనియాడారు. 18 ఏళ్లకే ఓటు హక్కు, పంచాయతీ రాజ్‌ చట్టాలతో పాటు ఎన్నో సంస్కరణలను తీస్కొచ్చింది రాజీవ్‌ గాంధీయే అని కొనియాడారు. రాజీవ్‌ గాంధీకి తెలంగాణకు ఏం సంబంధం అని కేటీఆర్‌ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. తన వ్యాఖ్యలను వెనక్కు తీస్కొని బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్‌ చేశారు. సీనియర్‌ కాంగ్రెస్‌ నాయకులు జీ. కన్నయ్య లాల్‌, పులిపాటి రాజేష్‌ కుమార్‌, ముజీబ్‌ ఉల్లా షరీఫ్‌, దినేష్‌, ఓం ప్రకాష్‌ శర్మ, సయ్యద్‌ షా ముజాహిద్‌, మూసా ఖాసీం, కాశమోనీ శ్యామ్‌ రావు ముదిరాజ్‌, అబేద్‌ అలీ, కృష్ణ కుమార్‌ పాల్గొన్నారు.